ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్

కల్వకుర్తి, మార్చి 28 : ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాలని కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన భవనాలు, పెట్రోల్ బంకులు, ఫంక్షన్‌హాళ్లు, రైస్ మిల్లులను గురువారం కమిషనర్ తన సిబ్బంది తో కలిసి తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని కుర్మిద్ద రోడ్డులో గల రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు ఆయన తాళం వేశారు. ఫంక్షన్ హాల్‌కు సంబంధించిన ఆస్తి పన్నును చెల్లించేందుకు తగిన డాక్యుమెంట్లు సమర్పించనందున తాళం చేసినట్లు కమిషనర్ తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక అందుకు సంబంధించిన డాక్యుమెంట్‌లను మున్సిపాలిటీలో సమర్పించి ఆస్తి పన్నును నిర్ధారించుకోవాలని ఆయన సూచించారు. అలా చేయకుండా కొందరు కాలయాపన చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణదారులు ఆస్తి పన్నును నిర్ధారించుకుని నిర్ణీత గడువులోగా చెల్లించి రాయితీ పొందాలని కోరారు. ప్రసుత్తం ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం రాయితీ ఉందని, ఈనెలాఖరుతో గడువు ముగుస్తుందని ఆయన గుర్తు చేశారు. ఆస్తిపన్ను చెల్లించుకుంటే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట మేనేజర్ రాజకుమారి, ఆర్ఐ చంద్రయ్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రాయల్ ఫంక్షన్ హాల్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బాలింత మృతిపై అధికారుల విచారణ

ప్రభుత్వ దవాఖానలో వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారులు

అచ్చంపేట టౌన్, మార్చి 28 : బాలింత కల్పన మృతిపై అధికారులు విచారణ చేపట్టారు. గురువారం ప్రోగ్రాం అధికారిణి సుమిత్ర, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ రాము అచ్చంపేట ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. బాధితులు దవాఖానలో చేరినప్పటి నుంచి జరిగిన పరిణామాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. బాధితులు ప్రైవేట్ దవాఖానకు వెళ్లడం, అక్కడ జరిగిన సమా చారాన్ని అడగగా సిబ్బంది సరైన సమాచారం ఇవ్వలేదు. దీంతో బాధితులు సంప్రదించిన ప్రైవేట్ దవాఖానలను అధికారులు తనిఖీ చేసి అక్కడి సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. మరింత సమాచారం సేకరించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వారి వెంట వైద్యాధికారులు నర్సింహులు, నిరంజన్ ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వెల్దండ, మార్చి 28 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వెల్దండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులు బ్యాంకులకు వెళ్లి రుణమాఫీ డబ్బులు తీసుకోవాలన్న హామీ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతు బంధుకు తూట్లు పొడిచారని, పంటలకు నీళ్లు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే అన్నదాతను ఆగం చేయడమేనా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలు ఏమయ్యాయన్నారు. మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున ఇస్తానన్న పింఛన్లను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600లు చెల్లించాలి

కూలీలతో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న

తాడూరు, మార్చి 28 : ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600లు చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న అన్నారు. గురువారం మండలంలోని అల్లాపూర్, గోవిందాయిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం బడ్జెట్ తగ్గిస్తూ కూలీల పొట్ట కొడుతుందన్నారు. కూలీలకు పని చేసే చోట మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహేశ్, భిక్షపతి, కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై వృథాగా పారుతున్న తాగు నీరు

కోడేరు, మార్చి 28 : మండలకేంద్రంలోని 3వ వార్డులో ప్రధాన రోడ్డుపై ఉన్న గేట్‌వాల్వ్ లీకేజీ అయ్యి వారంరోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. లీకేజీ అవుతున్న నీళ్లు సీసీరోడ్డుపై పారుతుండటంతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు అదుపుతప్పి కింద పడి గాయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్కీం బోరు ద్వారా వస్తున్న కొద్ది పాటినీటిని కూడా పొదుపు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని లీకేజీకి మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని స్థానికులు కోరతున్నారు.

గేట్ వాల్వ్ వద్ద లీక్ అవుతున్న నీరు

కందనూలులో 99.69 శాతం

- 319 ఓట్లకు గానూ 318 ఓట్లు పోలింగ్
- పోలింగ్ సరళిని పరిశీలించిన బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

కొల్లాపూర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్‌లో ఓటేస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే రాజేశ్

కల్వకుర్తిలో ఎమ్మెల్యే కశిరెడ్డి



నాగర్‌కర్నూల్ పోలింగ్ కేంద్రం వద్ద స్థానిక ప్రజాప్రతినిధులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మార్చి 28: మహబూబ్‌నగర్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 319 ఓట్లకు గానూ 318 ఓట్లు పోలయ్యాయన్నారు. కొల్లాపూర్ 6వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో 67కు 67మంది ఓటు వేయగా.. నాగర్‌కర్నూల్‌లోని 7వ పోలింగ్ కేంద్రంలో 101 ఓట్లకు గానూ 100 ఓట్లు (99.99 శాతం), అచ్చంపేటలోని 8వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో 79 మందికి 79 మంది (100 శాతం), కల్వకుర్తి 9వ పోలింగ్ కేంద్రంలో 72 మందికి 72 మంది (100 శాతం) ఓటు వేశారు. మహబూబ్‌నగర్ రిసీవింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్స్‌లను పటిష్ట భద్రత మధ్య తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ కలెక్టరేట్ నుంచి అధికారులతో ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సీతారామారావు నాగర్‌కర్నూల్ జెడ్పీ పాఠశాలలోని పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు కృషి చేసిన అధికార యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

పోలింగ్ సరళి పరిశీలన

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటేసిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పైకా భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 7లో ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పైకా భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ సీతారామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రంలోనికి ఓటు హక్కు ఉన్నవారిని మాత్రమే అనుమతించాలని, సెల్‌ఫోన్లు, పెన్ను, ఇతర వస్తువులను పోలింగ్ కేంద్రంలోనికి అనుమతించకూడదని పోలింగ్ అధికారులకు సూచించారు.

కల్వకుర్తిలో వందశాతం..

కల్వకుర్తి రూరల్/ వంగూరు, మార్చి 28 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వందశాతం పోలింగ్ నమోదైనట్లు న్నికల నిర్వహణాధికారి ఆర్డీవో శ్రీను తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని మున్సిపాలిటీ పాలక మండలి, కల్వకుర్తి, వెల్దండ, ఊర్కొండ, చారకొండ, వంగూరు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు మొత్తం 72 మందికి గానూ అందరూ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌కేంద్రం వద్ద ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంపీటీసీలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితోపాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలలోపు 72మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి తానీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో వెంకట్రాములు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంగూరు మండలానికి చెందిన 10మంది ఎంపీటీసీలు, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎంపీపీ భీమమ్మతోపాటు వైస్ ఎంపీపీ సంధ్య, మరో 8మంది ఎంపీటీసీలు క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు వేశారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ రూరల్, మార్చి 28 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం కొల్లాపూర్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ సమయం ముగిసే సరికి 67ఓట్లు మొత్తం పోల్ కావడంతో వంద శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట టౌన్, మార్చి 28 : అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసిందని ఆర్డీవో మాధవి తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి 79 మందికి 79 ఓట్లు పోలైనట్లు ఆమె తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

ఊర్కొండ, మార్చి 28 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీటీసీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఆరుగురు ఎంపీటీసీలకు గానూ ఐదుగురు గురువారం ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాధాజంగయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన నవీన్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని పేర్కొన్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో ఎంపీపీలు రాధాజంగయ్య, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌గుప్తా, లావణ్యాఅమరేశ్వర్‌రెడ్డి, ఈశ్వర మ్మాముత్యాలు ఉన్నారు.

ఊర్కొండలో ఓటుహక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎంపీటీసీలు

నాగర్‌కర్నూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొల్లాపూర్‌లో ఓటర్‌లిస్టును తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

తాడూర్ సింగిల్ విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి

ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్‌రెడ్డి

తాడూరు, మార్చి 28 : తాడూరు సింగిల్‌విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. విండో చైర్మన్ ఎండి.సమ్మద్‌పాషా బుధవారం తన పదవికి రాజీనామా చేయడంతో గురువారం సింగిల్ విండో కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విండో ఉపాధ్యక్షుడిగా ఉన్న వెంకట్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తీర్మాణం చేశారు. కార్యక్రమంలో సీఈవో ఆంజనేయులు, విండో డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బెల్లం ఊటను పానబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాగర్‌కర్నూల్, మార్చి 28: మండలంలోని జొన్నలబొగుడ తండా, సాతాపూర్ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులునిర్వహించి సారా, బెల్లం పాకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. గ్రామాల్లో సారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం అమ్మితే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కత్తితో దాడి: కేసు నమోదు

బల్మూరు, మార్చి 28 : మండలంలోని మైలారం గేట్ సమీపంలో జరిగిన కత్తి దాడిలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. బల్మూరుకు చెందిన కిరణ్ బుధవారం రాత్రి బైక్‌పై అచ్చంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మైలారం గేట్ సమీపంలో కత్తితో దాడి చేశారు. ఘటనలో కిరణ్ కుడి తొడ, వీపు భాగంలో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన పెంచాలి

- రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్

అధికారులకు సూచనలు చేస్తున్న అమర్‌సింగ్‌నాయక్

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 28 : కీటక జనిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీటక జనిత వ్యాధులపై జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,సూపర్‌వైజర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని వాటిని నిర్మూలించేందుకు ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ముఖ్యంగా దోమలను నియంత్రించాలన్నారు. అందుకు గాను ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, వారానికో రోజు డ్రై డే పాటించాలని, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, భీమానాయక్, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, తారాసింగ్, శ్రీనివాసులు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'కు నమోదు చేసుకోవాలి

అమ్రాబాద్, మార్చి 28 : ఆయుష్మాన్ కార్డులకు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని మన్ననూర్‌లో ఆయుష్మాన్ భారత్‌కార్డుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పోర్టులో తమ పేర్లను నమోదు చేసుకొని ఆభా కార్డులను అందుకోవాలని సూచించారు. కార్డుల నమోదు వివరాలను వైద్య సిబ్బంది, ఏఎన్ ఎంలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, ప్రోగ్రామ్ అధికారి ప్రదీప్, స్థానిక వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాధాకృష్ణ

రాధాకృష్ణ

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది వి.రాధాకృష్ణ ఎన్నికయ్యారు. 2024-2025 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశానుసారం గురువారం జిల్లా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా అర్జునయ్య వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాధాకృష్ణ. కార్యదర్శిగా పర్వత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వి.రఘునాథరావు, జాయింట్ సెక్రెటరిగా సయ్యద్ ఫసియొద్దీన్, ట్రెజరర్‌గా బంగారయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శంకర్, ఖాజా అబ్దుల్ రహీం, భవానీ బాయ్, రజనీకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైనవారికి తోటి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చంపేట అధ్యక్షుడిగా రాజేందర్..

అచ్చంపేట, మార్చి 28 : అచ్చంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగాపురం రాజేందర్ ఎన్నికయ్యారు.

అచ్చంపేటలో అసోసియేషన్ సభ్యుల సన్మానం

గురువారం అచ్చంపేట బార్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజేందర్, రామ్మోహన్ పోటీపడగా ఎన్నికలు నిర్వహించారు. ఇందులో రాజేందర్‌కు 21 ఓట్లు రాగా రామ్మోహన్‌కు ఒక్క ఓటు లభించిం ది. దీంతో రాజేందర్‌ను అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధానకార్యదర్శి గా ఎండీ.కౌసర్, సాంస్కృతిక కార్యదర్శి గా మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను న్యాయవాదులు స త్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మస్తాన్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌శెట్టి, వెంకటేశ్, వినోద్, కృష్ణ, మ ల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ అధ్యక్షుడిగా శ్రీహరి ..

కొల్లాపూర్ రూరల్, మార్చి 28 : కొల్లాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కర్నె శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా పిరం గి గోవింద్, ఉపాధ్యక్షురాలిగా రామలక్ష్మ మ్మ, కోశాధికారిగా నిరంజన్ ఎన్నిక య్యారు.

వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

పెద్దకొత్తపల్లి, మార్చి 28: మండలంలోని వెన్నచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో వారంరోజులపాటు రాత్రి వేళల్లో ఇండ్లల్లో దొంగతనాలు చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రవి, జనార్ధన్, శంకర్, బొజ్జమ్మ, సంతోశ్, మల్లేశ్ ఇండ్లలో దుండగులు దొంగతనాలకు పాల్పడడంతో ఆ కుటుంబాల యజమానులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం పూట ప్రజలు పొలాలకు వెళ్తుండడంతో ఇదేఅదనుగా చేసుకొని గ్రామంలోని యువత చెడు అలవాట్లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దొంగతనాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

31 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కొల్లాపూర్ రూరల్, మార్చి 28 : ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 31వతేదీ నుంచి మండలంలోని చౌటబెట్ల గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాలకృష్ణ, విష్ణు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా షిల్డ్‌తోపాటు రూ.30వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు షిల్డ్‌తో పాటు రూ. 20 వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు 970193847, 8074844892 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ 2న మండల సర్వసభ్య సమావేశం

తాడూరు, మార్చి 28 : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ శ్రీదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులతో పాటు కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ

పెద్దకొత్తపల్లి, మార్చి 28: మండలంలోని గంట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యా యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్, మార్చి 28 : మండలంలోని మార్చాలకు చెందిన రమేశ్, సునీత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా రాష్ట్ర మిషన్ భగీరథ వైస్‌చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ రూ.ఆరువేల ఆర్థికసాయం అందజేశారు. రమేశ్, సునీత దంపతులు మృతి చెందడంతో ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన నగదును బీఆర్ఎస్ యూత్ సభ్యులు బాధిత కుటుంబసభ్యులకు అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిశోర్, లింగం, తిరుపతయ్య, మల్లేశ్, గణేశ్, రమేశ్, పాండు, నాగరాజు, ఆంజనేయులు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు